కర్నూలు జిల్లాలో దాదాపు ఏడునెలలుగా 'కిరాయి హంతకుల' పేరిట పోలీసులు చేస్తున్న హత్యలను చూస్తున్నాం.

కోట్ల విజయభాస్కరరెడ్డి మనుషులను సహితం చంపేసరికి చాలామంది పెద్దమనుషులు 'ఇది అన్యాయం' అన్నారుగానీ, అంతవరకు అందరూ మౌనంగా ఆమోదించినవారే. మౌనంగానేమి, భేష్ అంటూ సమర్ధించినవారే. 'ఈ హక్కుల సంఘాలు తప్ప వేరే ఎవ్వరూ నన్ను తప్పు పట్టడం లేదు' అని ఎస్.పిగారు స్వయంగా విలేకర్ల దగ్గర వాపోయారు.

ముఠా రాజకీయాలకు నిలయమైన మన జిల్లాలో ఈ హత్యల గురించి చర్చ కూడా ముఠా రాజకీయ చట్రంలోనే జరిగింది. కాంగ్రెస్ పార్టీకీ తెలుగుదేశం అసమ్మతి వర్గానికీ చెందిన నాయకుల అనుచరులను చంపుతున్నారే తప్ప అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల అనుచరులను చంపడం లేదని ఆరోపిస్తున్నారు.

వారిని కూడా చంపితే సరిపోతుందని కాబోలు.

అసలు ఎవరినైనా సరే చంపే అధికారం పోలీసులకు ఉందా? అన్నది ప్రధానమైన ప్రశ్న. రాయలసీమను ఏలుతున్న హత్యారాజకీయాలంటే అందరికీ అసహ్యమే. కానీ పోలీసులు మరికొన్ని హత్యలు చేయడం హత్యారాజకీయాలకు జవాబా? అన్నది రెండవ ప్రశ్న. హత్యారాజకీయాలకు బాధ్యులయిన వారిని చంపడమే దానికి జవాబని నమ్మి అందుకు బాధ్యులు కాకి రామలింగప్రసాద్, కిష్టన్నలు మాత్రమేనా? అన్నది మూడవప్రశ్న.

మూడు నుండి ఒకటికి వద్దాం.

# ఈ ఎన్‌కౌంటర్ హత్యలనూ వ్యతిరేకిద్దాం రండి



కర్నూలులో ఫాక్షన్ రాజకీయాలకు ఎవరు బాధ్యులు? పడమటి తాలూకాలలోని గ్రామకక్షలన్నీ కోట్ల విజయభాస్కరరెడ్డి- కె.ఇ కృష్ణమూర్తి వర్గాల వైరంతో ముడిపడి ఉన్నాయనీ ఆ వైరం వల్లనే ఆ కక్షలు పదే పదే పెచ్చరిల్లుతున్నాయనీ 1990 ప్రాంతంలో ఈ జిల్లా పోలీసు ఇంటెలిజెన్స్ విభాగం రాసిన నివేదికలోనే గుర్తించారు. అంతే తప్ప కిష్టన్న, రాముడు వాటికి బాధ్యులని అనలేదు. ఈ సంగతి ప్రస్తుత ఎస్‌పి సీతారామాంజనేయులు గారికి తెలీదా? పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత పాత రిపోర్టులు చదివి తాను ఏలబోతున్న జిల్లా గురించి తెలుసుకునే అలవాటు వారికి లేదా? ట్రైనింగ్‌లో వారికి ఆ సత్సంప్రదాయాన్ని నేర్పలేదా?

తూర్పు కర్నూలయినా అంతే. కోవెలకుంట్ల ముఠా రాజకీయాలకు ఒక శతాబ్దం పైబడిన చరిత్ర ఉంది. దానికి బాధ్యులయిన వారి జాబితా రాసుకుంటే ఈ రెడ్డి, ఆ రెడ్డి, ఇంకొక రెడ్డి ప్రముఖులుగా కనిపిస్తారు తప్ప కాకి రామలింగప్రసాద్ కాదు. ప్రస్తుత తరాన్నే తీసుకున్నా, చల్లా రామకృష్ణారెడ్డినీ కాటసాని రాంభూపాలరెడ్డినీ బెజ్జం పార్ధసారధిరెడ్డినీ అదుపు చేయలేక వారి కొట్లాటలలో పావులయిన ఎరుకల కులస్తులను చంపడం ఎందుకు? ఆ రెడ్ల కన్నా కాకి రామలింగప్రసాద్ ఎక్కువ దుర్మార్గుడు కాడే.

ఆళ్లగడ్డ తాలూకాలో తన స్వంత దళం పెట్టుకొని కొన్నేళ్లు సంచరించిన నల్లబోతుల సుంకన్నకు 'నకిలీ నక్సలైట్' అని పేరు పెట్టి చంపారు. నకిలీయో అసలీయోగానీ భూమా నాగిరెడ్డి ఏకచ్ఛత్రాధిపతిగా ఏలుతున్న ఆళ్లగడ్డలో హంతకుడు అంటూ కన్నెర్ర చేయడానికి సుంకన్నే దొరికాడా? అక్కడ హింస 'భూమా' అన్న స్టిక్కర్ అంటించుకొని తిరుగుతుందని ఎస్‌పిగారికి మేము చెప్పాలా?

అక్కడి నుండి నందికొట్కూరుకు పోతే, 'చంపి చేపలకేస్తాడు' అని పేరు పొందిన బైరెడ్డి రాజశేఖరరెడ్డిని కాదని పూడూరు బోయలను ఆ తాలూకాలో హింసకు సంకేతంగా భావించడం పోలీసువారికి ఎట్లా సాధ్యం అయింది? పైగా వాళ్ల వల్ల బైరెడ్డికి ప్రాణాపాయం ఉందని తెలిసింది అని చంపిన తరువాత ఎస్‌పి అన్నారు. బైరెడ్డి వల్ల ప్రాణభయం ఉన్నవాళ్లు కూడా పోలీసువాళ్లను అదేసాయం కోరవచ్చునా?

ఇంక రెండవ ప్రశ్నకు వద్దాం. ఫాక్షన్ ముఠాల నాయకులకు చిరునవ్వుతో స్వాగతమిచ్చి ఆసనాలు చూపించే పోలీస్ అధికారులు, వారి అనుచరులనో లేక వారి పురమాయింపు మీద కిరాయికి హింస చేసే వారినో చంపి ఫాక్షన్‌లను అంతమొందిస్తున్నామని భుజాలు చరుచుకోవడం సబబా అన్న ప్రశ్న పక్కనపెట్టి, పోలీసులు చట్టాన్ని పక్కన పెట్టి విచ్చలవిడిగా హత్యలకు పాల్పడడం ద్వారా ఫాక్షన్ హింసను అంతమొందిస్తారని నమ్మడం తెలివయిన వైఖరేనా అన్న ప్రశ్న వేసుకుందాం.

అది తెల్లబట్టల దౌర్జన్యాల స్థానంలో ఖాకీబట్టల దౌర్జన్యాన్ని ప్రవేశపెడుతుంది తప్ప వేరే ఏమీ చేయదు.

కడపజిల్లాలో ఉమేశ్‌చంద్ర ఎస్‌పిగా ఉన్న రోజులలో ఈ ప్రయత్నమే జరిగింది. ఆయన కూడా సీతారామాంజనేయులుగారి లాగ, ఫాక్షన్ హింసను సోపానం చేసుకుని రాజకీయాలలో పైకి ఎగబాకిన నాయకులనందరినీ విడిచిపెట్టి దళిత కులాలకు చెందిన కాల్బలాన్ని ఎన్‌కౌంటర్‌ల పేరిట హతమార్చడం ద్వారా ముఠారాజకీయాలకు అంతం పలుకుతానని ప్రతిజ్ఞ పూనాడు. అక్రమ ఆయుధాలు స్వాధీనం చేసుకోవడానికి పోలీసులకు విచ్చలవిడి అధికారాలిచ్చాడు. ఫాక్షన్ ముఠాల దౌర్జన్యాలతో విసిగిపోయిన ప్రజలు చాలామంది ఆయనను పొగిడారు.

కానీ ఆ ప్రయోగం భావమేమిటో త్వరలోనే అర్థం అయింది. పోలీసులు జనాన్ని అక్రమంగా నిర్బంధించడం, ఆయుధాలు ఉన్నవీ లేనివీ తెచ్చి ఇమ్మని హింసించడం, బెదిరించి డబ్బులు వసూలు చేసుకోవడం మొదలుపెట్టారు. 'ఓట్ల పండగ' అని మన పత్రికలు వర్ణించే ఎన్నికలు వచ్చినప్పుడు సగటు ఓటరు ఓటు వేయడానికి సహితం ఇల్లు విడిచి బయటకి పోవడానికి భయపడే భీతావహ వాతావరణం పోలీసులు కల్పించారు. చివరికి ఉమేశ్‌చంద్ర కడప నుండి బదిలీ అయిన నాడు అతని తర్ఫీదులో విచ్చలవిడి హింస అలవరచుకున్న పోలీసు సిబ్బంది కడప పట్టణంలో చేసిన భయానకమైన వీరంగం చూసినప్పుడు ఫాక్షన్ హింసకు పోలీసుహింస జవాబనుకోవడంలో ఉన్న తప్పేమిటో కడప ప్రజలకు అర్థమయింది.

కర్నూలులో కూడా మనం అనుభవించే దాకా ఆగుదామా? లేక ముందే కళ్లు తెరిస్తే మంచిదా?

ఫాక్షనిజాన్ని రాజకీయాల నుండి వెలివేయడం దానిని అంతం చేయడానికి చేపట్టవలసిన మొదటి చర్య. దానికి తెలుగుదేశం పార్టీగానీ కాంగ్రెస్ పార్టీగానీ ఎంత మాత్రం సిద్ధంగా లేరు. ఈ జిల్లాలో సగంపైగా ఎంఎల్ఏలు, ఇద్దరు ఎంపిలు ఫాక్షనిస్టులే, లేక ఫాక్షనిస్టు కుటుంబాలకు చెందినవారే. వారు హింస చేసి గెలవగలరు కాబట్టే వారికి టికెట్లిచ్చారు, అది చేసే వారు గెలిచారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం ఫాక్షన్ హింసనొక సాధనంగా వాడుకుంటూ దాన్ని అదుపు చేసే పేరిట పోలీసులు చేజిక్కించుకుంటున్న విచ్చలవిడి అధికారాలకు ఆమోదం తెలపడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిగ్గు కూడా అనిపించడం లేదు.

ఫాక్షనిజాన్ని మన జీవితాల నుండి వెలివేయడం రెండవ చర్య. మన 'అవసరాల' కోసం మనం వారిని ఆశ్రయించి వారి 'బలం' అండ చూసుకొని మన ప్రయోజనాలు అక్రమంగానయినా సరే సాధించుకుందామన్న ఆలోచన ప్రజలందరికీ- అన్ని వర్గాల ప్రజలకూ- అలవాటయింది. ఆ రకంగా మనమే వారి దౌర్జన్యాలను పెంచి పోషిస్తున్నాం. దానిని వదులుకోవడానికి మనం సిద్ధపడిన రోజు ఫాక్షన్ ముఠాలకు సామాజిక పునాది లేకుండా చేసిన వాళ్లమవుతాము. మన సంకుచిత ప్రయోజనాల కారణంగా మనం దానికి సిద్ధపడకుండా, పోలీసులకు విచ్చలవిడిగా హత్యలు చేసే అధికారం ఇస్తే ముఠారాజకీయాల హింస ఆగిపోతుందని మనకు మనం భ్రమ కల్పించుకుంటున్నాం. ఖాకీహింసకు ఆమోదముద్ర వేయడం తప్ప మనం దీని వల్ల సాధించబోయేది ఏమీ లేదు.

చివరిగా మొదటి ప్రశ్నకు వద్దాం. మనం ప్రజాస్వామ్యంలో బతుకుతున్నామని గర్విస్తున్నాం. ప్రజాస్వామ్యమంటే ఏమిటో తెలుసుకోకపోతే మాత్రం దానిని కాపాడుకోలేము. చట్టబద్ధపాలన ప్రజాస్వామ్యంలోని ప్రధాన అంశాలలో ఒకటి. అధికార యంత్రాంగం రాజ్యాంగము, చట్టము తనకిచ్చిన అధికారాల పరిధికి లోబడి పని చేయాలి. అప్పుడే ప్రజల హక్కులకుగానీ జీవితానికిగానీ కొంచెమైనా భద్రత ఉంటుంది. దుర్మార్గుల పేరు చెప్పి, అసాంఘికశక్తుల పేరు చెప్పి, అత్యవసర పరిస్థితుల పేరు చెప్పి చట్టం ఆమోదించని అధికారాలు చేజిక్కించుకోవాలని పాలనా యంత్రాంగం ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. ఆ దుర్మార్గులు దుర్మార్గులేననీ ఆ అసాంఘికశక్తులు అసాంఘికశక్తులేననీ ఆ పరిస్థితి అత్యవసర పరిస్థితేననీ ఒకవేళ మనం కూడా ఒప్పుకున్నా, ఆ పేరు చెప్పి చట్టాన్ని పక్కన పెట్టే వ్యవహరించే అధికారాన్ని పాలనాయంత్రాంగానికి అప్పగించినా లేక వారు చేజిక్కించుకుంటే ఆమోదించినా అది చాలా తెలివితక్కువ పని అవుతుంది. ప్రజాస్వామ్యానికి మనమే గోరీకట్టిన వాళ్లమవుతాము. మన హక్కులను చేజేతులా పోగొట్టుకున్న వాళ్లమవుతాము. చట్టంలో పోలీసులకు ఉండేవి రెండే బాధ్యతలు. ఒక నేరంగానీ అల్లరిగానీ జరగబోతుందని తెలిస్తే వాటిని నివారించడం, జరిగాయని తెలిస్తే పరిశోధించడం. వాళ్లకు వేరే ఏ అధికారమూ లేదు. ఈ రెండు పనులూ కూడా చట్టం నిర్దేశించే పద్ధతిలో, ప్రజల హక్కులకు లోబడి చేయాలి. ఎవరినీ చంపే హక్కుగానీ హింసించే హక్కుగానీ పోలీసులకు లేదు. 'చంపేసి, వాడు నన్ను చంపబోయాడు కాబట్టి నేను ముందే చంపేశాను' అని ప్రకటించి చేతులు కడిగేసుకునే హక్కు అసలే లేదు. పోలీసు యంత్రాంగాన్ని దాని పరిమితమైన అధికారాల పరిధికి, దానికి చట్టం నిర్దేశించే నియమాల పరిధికి పరిమితం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**1 ఫిబ్రవరి 2001**

మానవహక్కుల వేదిక (HRF)

కర్నూలు జిల్లా

ప్రచురణకర్త: యు.జి.శ్రీనివాసులు, 22/227, కార్వాన్‌పేట, ఆదోని, కర్నూలుజిల్లా. ముద్రణ:నవ్యప్రింటర్స్, హైదరాబాద్